# ఎవరి కెవరు

పదేళ్ళకి మళ్ళీ మా ఊరు వెళ్ళాను క్రితం వేసవిలో.

ఊరు అట్టే మారకపోయినా ఊళ్ళో ముఖాలు కొత్తగా ఉన్నాయి. చిన్ననాటి స్నేహితులలో ఇద్దరు కనబడ్డారు. కాని ముఖాలు అప్పటి ముఖాలు కాదు. మీసాలు నల్లబడ్డాయి. ఒకతను రెండేళ్ళ కొడుకుని ఎత్తుకుని కనబడ్డాడు. ఏదో పలకరించుకున్నాం. రెండు మాటలే మాట్లాడుకున్నాం. ఇదివరకులా మాట్లాడుకోలేనందుకు చిన్నబుచ్చుకున్నాం. బెంగగా మళ్ళీ తప్పకుండా కలుసుకునే పద్ధతిమీద విడిపోయాం. ఇంక మళ్ళీ కలుసుకో కూడదని కూడా లోపల అనుకున్నాం.

వేసవిలో మా వాళ్ళంతా పొలంలో ఇంట్లోకి మారిపోయారు. చెరుకుతోట లుండే రోజుల్లో అలవాటది. చెరుకు తోటలు పోయినా అలవాటు మాత్రం పోలేదు.

పొలంలో ఇల్లు చిన్నది. అంచేత రెండు పెద్ద చింతచెట్ల కింద స్థలం బాగుచేసి మగవాళ్ళంతా అక్కడ విశ్రమిస్తారు.

పాలేరు వచ్చి చింతచెట్లకింద నీళ్ళు జల్లాడు. జములునేత తాటాకు చాపలు రెండు పరిచాడు. అంతా కూర్చున్నాం. పాలేరు నాకేసి కొత్తగా చూసి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ వుంటే బాబయ్య పిలిచి చెప్పాడు. "ఒరేయ్! అబ్బాయి వొచ్చాడు. ముంజికాయలు ఏమన్నా కొట్టి నీళ్ళతొట్టిలో పడెయ్యి" పాలేరు నావేపు చనువుగా చూసి వెళ్ళిపోయాడు.

ఊళ్ళోంచి అయిదారుగురు పెద్దలు వచ్చారు. ఇద్దరు నన్నెరుగుదురు. చింతచెట్టు తొర్రలోనుంచి కొత్తపేక తీశారు.

"ఏరా! బేస్తు ఆడతావా?" అన్నాడు బాబయ్య.

"ఆడనయ్యా, బద్ధకంగా ఉంది."

"అయితే ఆ చింతచెట్టుకింద మంచం వాల్చుకుని పడుకో. చల్లగా ఉంటుంది. ఇదుగో దిండు."

ఇంట్లోకి వెళ్ళి నా సంచీలో పుస్తకం తీసుకుని రెండో చింతచెట్టు కిందకి వెళ్ళాను. మొదటి చింతకి ఒక ఏభయి గజాల్లో రెండో చింత ఉంది. మంచం వాల్చి పడుకున్నాను. పుస్తకం విప్పాను గాని, చదువు సాగలేదు. తడిసిన ఎండునేల వాసన దృష్టిని చెదరగొడుతోంది.

సాగరం ఊళ్ళోంచి గావును వస్తూ పలకరించాడు, "ఎప్పుడొచ్చావురోయి?" వచ్చి మంచంమీద కూర్చున్నాడు. ఆ చనువు నాకు కొంచెం చిరాకుగా ఉంది.

సాగరం మాకు కొంచెం దూరపు చుట్టం. నాకంటే బాగా పెద్ద. అయినా నేనూ అతనూ కలిసి చదువుకున్నాం. పెళ్ళి అయిన కొద్దిరోజులకే

అతను చదువు మానేశాడు. ఈ గడిచిన పది పదిహేను సంవత్సరాలలోనూ అతను బాగా పాడయి పోయాడనీ, ఆస్తి అంతా పాడుచేసుకున్నాడనీ మా వాళ్ళు చెప్పుకుంటూండగా విన్నాను.

"నీకేమన్నా పిల్లలా?" అని అడిగాడు. పక్కమంచం వాల్చుకుని పడుకున్నాడు.

"లేరు" అన్నాను.

"నా కిద్దరు. పెద్దది ఆడపిల్ల. ఎరుగుదువు కాదూ? అప్పుడు మూడు నాలుగేళ్ళది. మొన్ననే పెళ్ళి చేశాను. రెండోవాడు కుర్రాడు, పదేళ్లుంటాయి. వాడి పురిటిలోనే పోయింది మా ఆవిడ."

నేను కుడిచెయ్యి దిండుమీద ఆన్చి అతనివేపు తిరిగి చూచాను. అతను అప్రయత్నంగా వెనుకటి రోజుల్లోకి తడుముకుంటూ పోతున్నాడు. వెల్లకిల పడుకున్న అతని కళ్ళు ఎక్కడో ఆకాశంలో వెతుకుతున్నాయి. అవతల బేస్తు ఆట, చుట్టపొగలూ కొద్దిగా కనబడుతున్నాయి. దిమ్మ అవతల చేలోనించి వండుతున్న తాటిబెల్లం వాసన కొట్టింది. సాలీలపాలెంలో నించి విరామంలేని మగ్గంచప్పుడు శ్రుతిలాగ వినబడుతోంది.

"బేస్తు మొదలుపెట్టారు వాళ్ళు" అన్నాను నేను కొంచెం అనాలోచితంగా.

"పోనిద్దూ. రోజూ ఉన్నదేగా!"

నేను ఆ మాట అన్నందుకు కొంచెం నొచ్చుకున్నాను. తరవాత అడిగాను.

"ఏ ఊరిచ్చావు మీ అమ్మాయిని?"

"ఇక్కడే కాపురం. మనవాళ్ళందరికీ ఎంత గుర్రుగా ఉందను కున్నావు అబ్బాయి! ఊరికే సలహాలు ఇచ్చేవాళ్ళేగాని, ఒక్కడూ సమ

యానికి సహాయం చెయ్యడు. వాళ్ళు వైదీకులు. నాలుగు మెతుకులు తిన డానికి ఉంది. గౌరవంగా చేసుకుంటామన్నారు. నేనిక ఏమీ ఆలోచించలేదు. మన వాళ్ళయితే ఏమన్నా నెత్తిమీద రాయెత్తారేమిటి ?"

అతని గొంతుకలో నిందారోపణ ఏమీలేదు. చనువుగా అతను తన హృదయం విప్పుకుంటూంటే – నాకు కొంచెం చిన్నతనంగా అనిపించింది. వెచ్చని గాడుపు కొంత చల్లబడి వంటికి తగులుతోంది. ఇంక కదల నవ సరంలేని పరిస్థితి ఏదో ఏర్పడ్డట్టు మనస్సు నిశ్చింతగా స్తబ్ధంగా ఉంది. ఒక క్షణం అతడు మాట్లాడకుండా పడుకున్నాడు.

సాగరం మళ్ళీ మొదలు పెట్టాడు.

"నా సంగతి అంతా వింటే నీకు ఏమనిపిస్తుందో ! అయినా నువ్వు కొంత వినే వుంటావు. ఏమిటో, అంత వినటానికి మాత్రం ఏముందిలే."

నేను జవాబు చెప్పకుండానే అతనివేపు చూస్తున్నాను. అతను ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

"పురుడు వచ్చిన నాలుగోనాడు మా ఆవిడ పోయింది. అబ్బ! ఏం రోజులురా అవి, తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. ఆ రోజులలో గుడ్డును ఏం జెయ్యను? ఒక దాసీదాన్ని కుదిర్చాను-పిల్లాడికి పాలిచ్చే పద్ధతి మీద. దాన్ని చూస్తే నాకు వెలపరం వచ్చేది. ఏం వాసన! అయినా ఆ చంటిపిల్లాడు దాని దగ్గర ఆబగా పాలు తాగుతూఉంటే నాకు ఈర్ష్యగా ఉండేది. పోయిన మా ఆవిడ జ్ఞాపకం వచ్చేది. ఎంత పొంకమయిన మనిషి! అది చచ్చిపోకముందు ఎల్లా గుండేవాళ్ళం! ఒక ఆరేళ్ళపాటు రాజభోగంలాగ ఉండేది. తరవాత ఎన్నో సంబంధాలు వచ్చాయి. కాని నాకు పెళ్ళిమాట తలుచుకుంటే వెగటుగా ఉండేది."

అతను మంచంమీద పక్కకి వంగి చెయ్యిజాచి కుండలో మంచినీళ్ళు గ్లాసుతో ముంచుకున్నాడు. సంతృప్తిగా గడగడ తాగాడు, బీడీ తీసి మొదలు తుంచాడు. అగ్గితాడు అంటించి గుండెనిండా పొగ పీల్చుకున్నాడు. చెప్పరాని సన్నిహితమయిన ఇంద్రియ సుఖంతో చింతచెట్టుక్రింద గాలి అంతా నిండి పోయింది. నేను కూడా వెల్లకిల పడుకుని గుండెలమీద చేతులు ముడుచు కున్నాను.

"మాణిక్యం చాలా చిత్రమయిన మనిషి. దాని మొగం చూసి-ఇప్పు డయినా సరే-దాని వయస్సు నువ్వు కనుక్కోగలవా? ఎవరేమనుకుంటే ఏం గాని, అల్లాంటి మనిషి మళ్ళీ నాకు కనబడలేదు. మళ్ళీ పెద్ద ప్రేమా గీమా అనుకుంటావేమో! అదేం కాదు. కాని ఎంత గుండె అనుకున్నావు! అయినా ఎంత దొంగముండ!

మొదట అందరికీ ఉంపుడు కత్తెలు ఎల్లా అలవాటవుతారో నాకు అల్లా అలవాటు కాలేదు. ఒకవేళ అందరికీ నాకులాగే అలవాటవుతారేమో నాకు తెలియదు. మొట్టమొదట రైల్లో కలుసుకున్నా. ఆమె పడుకుంది. రైలుపెట్టె గుమ్మం దగ్గర ఎంతోమంది నిలబడ్డారు. నేను తోసుకుని లోపలికి ఎక్కాను. ఆమెను లేపబోతే ఎదురు బల్లమీద కూర్చున్న నల్లటి మనిషి ఒకడు అడ్డుపెట్టాడు. కొంచెం ఘర్షణ అయింది. అప్పుడు నాకు మంచీ చెడ్డా కూడా తెలిసేది కాదు. ఆమె ఒకసారి కళ్ళువిప్పి కొద్దిగా చూసి మళ్ళీ మూసుకుని నిద్ర నటించింది. నేను స్పష్టంగా చూశాను. నాకు చిరాకువేసి ఆమెను మోటుగా లేపాను. ఆమె లేచింది. నేను పక్కని కూర్చు న్నాను. ఇంకా ఏదో గట్టిగా మాట్లాడుతున్నాను రైల్లో కొందరు నిద్ర పోవటము, మిగతావాళ్ళు ఏడుస్తూ నిలబడ్డం వగైరా వగైరా. చటుక్కుని ఆమె దీనంగా గొంతుకపెట్టి అంది—

"మన్నించండి బాబూ! ఇంతమంది నిలబడ్డారని నూశ్శేదు....ఏరా

బావయ్యా, లేపమని సెప్పలేదూ? మన్నించండి బాబయ్యా! కొంచెం వొంట్లో నలతగా ఉంది."

"నా వాగ్ధోరణి అడ్డిపోయింది. నేను తెల్లబోయి ఆమెవేపు చూశాను. ఆ మొదటి చూపులో ఆమె పాతికేళ్ళ అమాయకురాలయిన కన్నెపిల్లలాగ నాకు కనబడింది. కాని ముఖంచూసి ఇప్పుడయినా ఆమెకు అంతకంటెవయసు ఉంటుందని ఎవరూ అనుకోరు. రైలుపెట్టె ఒత్తిడిలో ఆమె శరీరం నాకు చాలాసార్లు తగిలింది. సాధ్యమయినంత దూరానికి నేను జరుగుతూనే వచ్చాను. అయినా తగులుతూనే వచ్చింది. ఆమె కావాలని తన వొళ్ళు నాకు తగిలించిందని అప్పుడు నాకేం తెలుసు?"

"పోలీసాయన ఒత్తాడేమోరా ఈ రేత్రికి?" అంది ఎదురుగా ఉన్న మనిషితో.

"రాడు."

"ఆ సంభాషణ నేను వినగూడ దనుకుంటూనే శ్రద్ధగా విన్నాను. ఆమె ఊరూ, పేరూ, ఆమె నివాసం అన్నీ నా ప్రయత్నం అక్కరలేకుండానే నా చెవినిపడ్డాయి. ఆమె అతి నైజంగా అన్నీ నాకు తెలియజెప్పింది. అసలే స్థిమితం తప్పివున్న నా మనస్సు మత్తుగా పనిచేసింది. నాకు మైకం కమ్ముతున్నట్టు నాకు తెలుసును. కాని నేను మళ్ళీ తట్టుకునే ప్రయత్నం చెయ్యలేదు. ఉన్నట్టుండి నా వేపు తిరిగి అడిగింది. "మీదే వూరండి?"

"నిడదవోలు....కాదు........ఇప్పుడు తణుకు వెడుతున్నాను." అన్నాడు. ఆమె ఊరు తణుకు. నే నసలు నిడదవోలుకే టిక్కట్టు కొన్నాను. వెంటనే నే నన్నమాటకి నాలుక కరుచుకున్నాను.

"ఓ సాయం చెయ్యాలండి బాబూ! మా సామాను మీకింద చెప్పండి బాబూ! మీకు పున్నెం ఉంటది."

"నే నేమీ సమాధానం చెప్పలేదు. కాని ఆమెతో ఆవేళ తణుకులో దిగిపోయాను. పొద్దుండగానే ఆమె ఇల్లు ఆనమాలు పట్టాను. చీకటి పడిన తరువాత ఆమె ఇంటికి వెళ్ళాను. అసలు మొట్టమొదట ఆమెతో ఏం మాట్లాడానో ఎలా మాట్లాడానో నాకు గుర్తులేదు. కాని నేను నిర్లక్ష్యంగాను పొగరుగాను మాట్లాడినట్లు జ్ఞాపకం. ఆమె మాత్రం అన్నీ తెలుసుకున్న నేర్పుతో నన్ను మర్యాదగా, ఆదరంగా ఆటాడించింది. ఆమె చూపిన ఆడ తనపు ఆదరానికి నేను లొంగిపోయాను. నాలో అణువణువూ కూడా ఆమెకు కృతజ్ఞత చూపింది — పూర్తిగా కాలిపోయిన యిల్లు మళ్ళీ, కళ్ళ ఎదట లేచి నంతటి కృతజ్ఞత. నే నెంత సుఖపడ్డానో ఆ రాత్రి! ఎంత విశ్రాంతి పొందానో వర్ణించలేను.

అది మొదలు అయిదారేళ్ళు ఆమె వెంట వెంట తిరుగుతూ గడిపాను.

"ఆమె చిత్ర చిత్రంగా నన్ను ఆకర్షించేది. చిత్ర చిత్రంగా డబ్బు సంగ్రహించేది. ఒకసారి అకస్మాత్తుగా డొక్కలో నొప్పి వచ్చింది. నేను వైద్యుణ్ణి తీసుకువస్తా నన్నాను. లాభంలేదని చెప్పింది. ఆ నొప్పి ఇదివర కొకసారి వచ్చినట్టూ, దీనికి మళ్ళీ రాకుండాపోయే మందు లేదని డాక్టరు చెప్పినట్టూ, ఎప్పుడు వస్తే అప్పుడు మద్రాసువెళ్ళి పెద్ద ఆసుపత్రిలో ఉండి వస్తే అంత ప్రమాదం లేదని కూడా చెప్పినట్టూ నాతో చెప్పింది. నొప్పితో బాధపడుతూ, "ఇక్కడే మీ చేతిలోనే సచ్చిపోతాను సుకంగా. ....అంత దూరంపోతే సివరకి సావో బతుకో! ఎందుకొచ్చిన మద్రాసు .. అయినా డబ్బో?" అనేది. నేను అయిదు వందల రూపాయలు ఇచ్చి పంపించాను. నేను కూడా వస్తానంటే ఎంత చెప్పినా వద్దని అడ్డుపెట్టింది. అల్లరయి పోతుందనీ, తన పరువూ నా పరువూ కూడా దక్కదనీ ఎన్నో విధాల నచ్చ జెప్పింది. నాకు వారం రోజులకి ఒకోసారి ఉత్తరాలు వస్తూండేవి. రెండు

నెల్లకి ఆమె తిరిగి వచ్చింది - మునుపటికంటె పొంకంగా. మళ్ళీ తరవాత నా దగ్గర ఆమె రూపాయీ అర్ధా ఎప్పుడూ తీసుకోలేదు. ఆ నొప్పి అయిదారు నెల్లకి ఒకసారి వస్తూ ఉండేవి. వచ్చినప్పుడల్లా మద్రాసు ప్రయాణం.

అది ఇంక ఆఖరుసారి ఆ నొప్పిరావడం. అబ్బ! నే నెంత భయపడ్డాననుకున్నావు! చల్లగా చెప్పింది - ఈసారి ఏదో ఆపరేషను చేస్తేగాని బతకడమే కష్టమని డాక్టరుగారు చెప్పారంది. రెండు మూడు వేలదాకా అవుతాయని కూడా చెప్పింది. అప్పు తెచ్చి ఇచ్చాను. ఆమె వెళ్ళింది. నాకు మామూలుగా ఉత్తరాలు వస్తూ ఉండేవి. ఆతురతగా ఆమె ఎప్పుడు వస్తుందో నని ఎదురుచూస్తో ఉండేవాడిని. ఆపరేషను సవ్యంగా అయినట్టు, కులాసాగా ఉన్నట్టు ఇంకో వారం రోజుల్లో తిరిగి వస్తున్నట్టు, వచ్చేటప్పుడు సరాసరి మా ఇంటికే వచ్చి దిగేటట్టు వ్రాసింది.

"మరునాడు మా అన్నయ్య ఒక ఉత్తరం పట్టుకుని వచ్చాడు. ఉత్తరం ఆకాశరామన్న రాశాడు. సంగతులు — మాణిక్యం నొప్పి అంతా పట్టి నటన. ఆమె మద్రాసు వెళ్ళదు, మద్రాసు నుంచి ఉత్తరాలు రాసే స్నేహితు లున్నారు. ఆమె తల్లి వెలగపాడులో ఉంది. తక్షణం వెళ్ళినట్టయితే ఆమె అక్కడ దొరుకుతుంది." నాకు కళ్ళు తిరిగాయి. ఉత్త చవటలా అయిపోయినట్టు నాకు అనిపించింది. ఎంత మోసం! తక్షణం వెలగపాడు వెళ్ళి దాని సంగతి కనుక్కుంటానన్నాను. మా అన్నయ్య వారించాడు. ఓ వారం రోజులలో ఎల్లాగా వస్తుంది గదా, వచ్చినప్పుడు నీకూ నాకూ సంబంధం లేదని చెప్పెయ్యొచ్చునని సలహా ఇచ్చాడు. కాని నాకు చటుక్కుని అధైర్యం పట్టుకుంది. తీరా ఆమె ఎదురుగా వచ్చి నిలబడితే నేను మాట్లాడలేనేమో! మా అన్నయ్యని ఈ వారంరోజులూ ఉండమన్నాను.

వాడు నాలుగు రోజుల్లో మళ్ళీ వస్తానని వెళ్ళిపోయాడు."

సాగరం కథ ఆపి, ఇంకో బీడీ అంటించాడు. ఇదంతా అనుభవించిన వ్యక్తి ఒకడు నా పక్కని మంచంమీద పడుకుని తన కథ చెప్పుకుంటున్నాడని అనిపించేసరికి, కారణం లేని నిస్పృహ కలిగింది. ఇది మానవ స్వభావానికి దగ్గరా? దూరమా? ఇది బలమా? బలహీనతా ? నా ఆలోచనలు తెగకుండానే సాగరం మళ్ళీ మొదలుపెట్టాడు.

"ఆమె వచ్చిననాడు మా అన్నయ్య ముందు గదిలో కూర్చున్నాడు. నేను లోపలి గదిలో తలుపు మూసుకుని కూర్చున్నాను. మాణిక్యం వచ్చింది. అతి ప్రేమగా అంది – "సాగరంగా రున్నారండీ ?" మా అన్నయ్య దృఢంగా, గట్టిగా సమాధానం చెప్పాడు:

"ఉన్నారుగాని, కనబడరు" నాలో యేదో తీగ టక్కుని తెగిపోయింది.

"ఏమండీ?" ఆమె ఒక క్షణం ఆగి అడిగింది.

"నీ సంగతంతా మావాడికి తెలిసింది – నీ మోసమంతా. ఈ రోజు మొదలు నీకూ వాడికీ సంబంధం లేదని చెప్పమన్నాడు. నీకు ఎన్ని గుండెలున్నాయి? ఇంత మోసం చేశావు ?"

"మా బావయ్య ఉత్తరం రాశాడండీ? అది కీ మద్దె ఈసుగా ఉంది లెండి!"

"ఎవడో రాశాడు ఆకాశరామన్న. నువ్వింక వెళ్ళిపోవాలి." ఆమె ఒక క్షణం మాటాడలేదు. ఏదో ఆలోచిస్తూ నిలబడి ఉన్నది. తరవాత మెల్లగా అంది.

"బావయ్యగారు కోపం జేశారు. ఒక్కతూరి ఆరిని సూసిపోతాను. ఆరి కాళ్ళమీదపడి శలవు పుచ్చుకుంటాను. ఈనాటి సంబంధమాండి బాబూ? ఒక్కతూరి ఆరు కనబడరూ?"

'కనబడరు' అన్నాడు మా అన్నయ్య. వాడు అంత కఠినంగా మాట్లాడినందుకు నాకు కోపం వచ్చింది. తలుపు తీసుకుని ఇవతలికి రావా లనిపించింది. కాని మంత్రించినట్టు అలాగే కూర్చుండిపోయాను.

"బావగారు ! దయ వుంచండి. ఆరి పాదాలకి నా దణ్ణాలు. ఆరికి నే ఉత్తరం రాసుకుంటానండి. శలవండి" ఆమె నెమ్మదిగా వెళ్ళి పోయింది.

"నా గుండెలమీద ఒక పెద్ద బరువు దిగిపోయింది. కొద్దిరోజుల్లో పొలం చాలామట్టుకు అమ్మేసి అప్పుతీర్చాను. ఇప్పుడు మిగిలినదల్లా రెండెక రాలూ, ఆ యిల్లూ."

సాగరం మళ్ళీ మంచినీళ్ళు తాగాడు. పెద్దతనంతో సహా వెన్నంటే చిలిపితనం ఏదో గాలిలో కదిలి కొంచెం భ్రమపెట్టింది — అయిదేళ్ళలో ఆస్థి నంతా అమ్మివేయగల చిలిపితనం! చిన్నతనంలోనే పెద్దతనం, బాధ్యత అల వాటయిన నేను కుతూహలంగా కథ వింటున్నాను.

"తరవాత కథ నువ్వింకా వినలేదు"

"రెండునెల్లు గడిచిన తరవాత మా వదిన ఒకనాడు హఠాత్తుగా మా యింటికి వచ్చింది. ఎప్పుడూ రాని ఆమె ఎందుకు వచ్చిందా అని నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వచ్చీ రావడంతోనే పెద్ద శోకంతో మొదలు పెట్టింది."

"బాబోయి ! నా కాపరం ఎట్లాగయినా నిలబెట్టు బాబూ ! నీ గడ్డం పట్టుకుని బతిమాలుతాను. బిడ్డ పుడితే నీ పేరు పెట్టు కుంటాను !"

"ఏమిటమ్మా! అంత కంగారు పడుతున్నావు? ఏం జరిగింది?"

"ఇంకేముంది బాబూ! దాని వల్లో పడిపోయారోయి. ఇంతవరకు నా కాసుల పేరు ఒకటే పోయింది. ఇంక కొంపా గోడూ నట్టేట్లో కలిసి పోతాయి తండ్రీ!" నాకు కాళ్ళూ చేతులూ వణికాయి. ఏమీ బోధ పడలేదు.

"ఎవరమ్మా అది?"

"ఇంకెవరు బాబూ, ఆ మాణిక్యం"

"నాకు తల గిర్రున తిరిగినట్టు అనిపించింది. మా వదిన సముద్రం మధ్యలో ఒక చిన్న కర్రముక్క పట్టుకుని గట్టు జేరుకోటానికి గిల గిల కొట్టుకుంటున్న ప్రాణిలాగ కనపడింది. ఆమెకు ఆ క్షణంలో సిగ్గులేదు. మానంలేదు, తెలివిలేదు, ఆలోచనలేదు. ఆమెను ఓదార్చి నేను తణుకు బయలుదేరాను.

గాడుపు కొంత ఎక్కువయింది. ఉండి ఉండి ఊపిరి పీల్చుకోవలసినంత ఉక్కగా ఉంది గాలి. పచ్చని చెట్లవనం మధ్య ఎండ మాత్రం కంటికి జిగ జిగ మనిపించడంలేదు. వివశమై మనస్సూ శరీరం ఏదో పెద్ద శక్తికి లోబడి నిస్సహాయంగా పడి ఉన్నట్టు నిస్పృహ గొలిపింది. కాని ఆ నిస్పృహలో చెప్పరాని విశ్రాంతి, సంతృప్తి ఉన్నాయి. జీవితమంతా ఒక శక్తికి లోబడిన ఆటలాగ అగుపించింది.

తీరా తణుకు జేరుకున్న తరవాత ఎందుకో పట్టపగలు ఆమె ఇంటికి వెళ్ళడం అసంగత మనిపించింది. ఊళ్ళో తిరుగుతూ ఉంటే మా అన్నయ్య కనబడ్డాడు. నన్ను చూసేసరికి వాడి నుదుటిమీద ముడతలు పడ్డాయి. మా వదిన నా దగ్గరకి వచ్చి చెప్పిన సంగతంతా చెప్పాను. మా వాడు నుదుటి మీది చెమట తుడుచుకొని అన్నాడు -

"కట్లకాసులు పేరు! తను ఏదో పెళ్ళికి వెడుతున్నాననీ, తన నగలు లేవనీ ఏమన్నా ఎరువు తెచ్చి పెడితే సంతోషిస్తాననీ అంది. తీసికెళ్ళి ఇచ్చాను. పెళ్ళినించి తిరిగివచ్చిన తరవాత కాసులపేరు తనే నావగ్గరకు పట్టు కొచ్చింది. మెళ్లో వేసుకుంది. "నా మెళ్లో బాగాలేదూ?" అంది. తరవాత అద్దంలో చూచుకుంటూ అంది. "మీ చేత్తో ఇచ్చింది మళ్ళీ పుచ్చు కుంటారా?" నా కింక దాన్ని ఎల్లా అడగాలో తెలియడంలేదు.

"ఒకళ్ళ కొకళ్ళం అన్నదమ్ములమని ఆ సమయంలో అనిపించినట్టు ఇంకెప్పుడూ అనిపించలేదు. పగలంతా ఏమీ మాట్లాడుకోకుండా స్కూలు వరండాలో కూర్చున్నాం. సాయంత్రం అవుతోంటే మా అన్నయ్య లేచాడు. "ఒరేయి! నే నింటికి పోతాను. ఎల్లాగయినా దాంతో నువ్వు వెళ్ళి మాట్లాడరా!" అన్నాడు.

"నువ్వు వెళ్ళడం మానేస్తేసరి - దాంతో మాట్లాడే దేమిటి ?" అన్నాను నేను.

"అల్లా నాకు మనశ్శాంతి ఉండదురా. వెళ్ళి తెగతెంపులు చేసు కోవాలి" మా అన్నయ్యను చూస్తే వలలో పడి కొట్టుకుంటున్న పెద్దచేప నాకు జ్ఞాపకం వచ్చింది.

"మా అన్నయ్య వెళ్ళిపోయాడు. నాకు సాయంత్రం అవుతుండగా చికాకు హెచ్చిపోయింది. పెద్ద ఉద్రేకంతో ఆమె ఇంటికి వెళ్ళాను. నేను ఎన్నితిట్లు తిట్టానో గుర్తులేదు. నాకు ఒళ్ళు తెలియలేదు. ఆమె నన్ను చూసి వింతగా లేచి నిలబడింది. అన్నీ వింది. నేను ఆయాసమొచ్చి ఊరుకున్న

తరవాత మంచం చూపించి కూర్చోమంది. నేను కూర్చోలేదు. "మీ అన్నయ్యగారు కనబడ్డారనుకుంటాను" అంది. నేను తలయెత్తి చూశాను. ఆమె ఒక పెట్టిలోంచి కట్ల కాసులపేరు తీసింది. మెడలో వేసుకుంది. ఆమె మెల్లగా "మీ అన్నయ్యగారిది కాదు. మీ వొదినగారి దనుకుంటా!" అంది. నా మెడలో ఎవరో ఉరి తగిలించి లాగుతున్నట్టు అనిపించింది. నేను జోరుగా అన్నాను-

"నీకు సిగ్గులేదు, జాలిలేదు, కనికరంలేదు!" ఆమె నా వేపు చూస్తూ అంది-

"పాపం మీ వదినగారికి కట్టంగా వుంటది. ఇది పట్టుకెళ్ళి ఇచ్చేస్తారా?" ఆమె మెడలోంచి కాసులపేరు తీసింది. నాకు చిరాకు వేసు కొచ్చింది.

"అయితే అసలు ఎందుకు పుచ్చుకున్నావు?" ఆమె చేతిలో కాసుల పేరు ఊడలాగి నేను చర్రుని గుమ్మంలోకి తిరిగాను. ఆమె చటుక్కుని గుమ్మంలోకి వచ్చి తలుపువేసి అడ్డుగా నిలబడింది.

"కొంచెం సేపు మంచీ చెడ్డా మాట్టాడుకుందాం" అంది.

"నీకూ నాకూ మంచీచెడ్డా ఏమున్నాయి?"

"మీ మంచే నా మంచి. అయిదేళ్ళ సంబంధం ఊరికే పోద్దా?" ఆమె చూసిన చూపులో ఒక నిర్వేదం నన్ను బంధించి వేసింది. నేను అక్కడ ఉన్న మంచంమీద చతికిలపడ్డాను. ఆమె అంది -

"మీరు ఈ రెండు నెల్లూ నన్ను సూడాలని అనుకోలేదూ? ఎప్పు డయినా ఒక్కసారయినా?........ఉత్త అలవాటు పద్ధతినే మీ అన్నయ్యా గారితో పరిచయం అయింది. అయినా మిమ్మల్ని తలుచుకోని రోజులేదు.

మీ రంతా శమత్కారం అనుకుంటారు. అలవాటు సొప్పున నోటంట మాటలొత్తా యంతే. ఒక్కతూరి సూత్తేనే అరిగిపోతారా? ఎంత కోప మొచ్చిందండి మీకు!............అయ్యాల మీ రేమనుకున్నారో! నేను నిజంగా అయాల మీతో అంతా చెప్పుకుందా మనుకున్నాను. ఆపరేషనంటే అన్నాను గాని మీకు గాయం ఎక్కడ సూపించను? దొంగతనం ఎల్లాగా దొరికిపోను; మీ రసలు లోపలికి రాని త్తేనా?"

నే నూరికే వెనకటి సంగతులు ఆలోచించుకుంటూ కూర్చున్నాను. నాకు మాట లేవీ తోచలేదు. ఆమె మళ్ళీ మొదలుపెట్టింది :

"నాకు జాలీ గీలీ లేదంటారు మీరు. ఏమో భగవంతుడి కెరిక-నేనెంత బాధపడ్డానో!"

"అయితే నే నిచ్చిన డబ్బంతా నాకు పంపించెయ్యక పోయావా? నీకు జాలేమిటి? అంత జాలే ఉంటే మళ్ళీ మా అన్నయ్య నెందుకు పట్టుకున్నావు!"

"మీ అన్నయ్యగారి కాసులపేరు మీకు నే నిచ్చెయ్య లేదూ? మీ డబ్బు మీకు పంపించాననుకోండి, మీరు మళ్ళీ నాకు దొరుకుతారా?"

"దొంగమాటలు. నన్ను మించినవా డింకొకడు దొరుకుతాడు."

"లేదు, లేదండి బావయ్యగారు. ఎంత సంతోసంగా గడిచిపోయాయి - ఆ అయిదారేళ్ళూనూ ! మీలాంటి మనిషి ఇంకో డుండడు ! ఏమయితేనేం, ఏదో క్రొంటి సరదాలో పడిపోయి అంత దొంగపని చేశాను. ఇదివరకు ఎన్ని స్నేహాలున్నా నాకు మనిషిని చూస్తే బయమనేది ఎరగను. ఓ మూల గుండెలు తీసిన పని చేస్తున్నా సరే. కాని మీతో గడిపిన ఆ అయిదేళ్ళూ మిమల్ని సూత్తే గాబరాగా ఉండేది.

అయినా ఏటో ఎదవబుద్ధి, బుద్ధి చిలిపి. సాత అలవాటు పట్టుకు వదల్దు. మా అమ్మ నాటిదో బామ్మ నాటిదో అస్తికలట్టిపోయి ఉంటది. అయినా ఎప్పుడయినా ఇల్లా అనిపించిందా?"

నేను క్రమంగా కరిగిపోయాను. ఆ మంచంమీదే సంతృప్తి కన్నీళ్ళలాగ నాలో ప్రవహించింది. ఆమె ఆగి ఆగి రహస్యం అడిగినట్టుగా అడిగింది.

"ఏమండీ బావయ్యగారూ! నే నంటే మీకు సరదా లేదండి!" నేనా మాటకి సమాధానంగా ఆ రాత్రి అక్కడే ఉండిపోయాను.

"మా వదిన కాసుల పేరుకోసం నే నమ్ముడుపోయాను. ఏమయినా అంతటి మనిషిని నేను మళ్ళీ చూడలేదు. మా అమ్మాయి పెళ్ళికి రెండు వేలు ఇచ్చింది. దాని కే మవసరం? అబ్బాయి! ఈ లోకంలో చివరకి ఎవరి కెవరో!"

సాగరం మళ్ళీ మంచినీళ్ళు తాగాడు. వెల్లకిల పడుకున్నాడు.

ఎండ ముదిరి చెమట పోస్తోంది. తరవాత ఎవరమూ మాట్లాడలేదు. సాగరం కల్మషంలేని మనస్సు నిశ్చింతగా నిద్రలో మునిగిపోయింది. నాకు నిద్ర రాలేదు. నేను లోకంలో అనుబంధాలను గురించి తెగ ఆలోచించాను. కాని చివరికి ఆ విషయం తెగనేలేదు. ఎవరికి ఎవరో !

(కథావాహిని – పద్మరాజు కథా సంకలనం

సం॥ గద్దె లింగయ్య; 1954)